క్లుప్తంగా

హరికుమార్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి : కిట్స్ కళాశాల మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న హరికుమార్ అందెం డాక్టరేట్ అందుకున్నారు. సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. 'డెవలప్‌మెంట్ ఆఫ్ అల్యూమినియం కాంపోజిట్ ఫోమ్, అనలిటికల్ న్యూమరికల్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ క్యారెక్టరయిజేషన్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. డాక్టర్ పి.రమేష్ పర్యవేక్షణలో పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించారు. ఈసందర్భంగా కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, ఏట డాక్టర్ రమేశ్ రెడ్డి, మెకానికల్ విభాగం అధిపతి రాజనరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రభాకరాచారి హరికుమార్‌ను అభినందించారు.

డంపింగ్ యార్డును వెంటనే తొలగించండి

- కలెక్టరేట్‌లో కాలనీవాసుల ఫిర్యాదు



మడికొండ : గ్రేటర్ వరంగల్ పరిధి 46వ డివిజన్ మడికొండ–రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గాలి, నీరు, కలుషితమవుతోందని సోమవారం అడ్‌హక్ కమిటీ సభ్యులు హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్ సెల్‌లో డీఆర్‌ఓ వైవీ గణేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ డంపింగ్ యార్డును సందర్శిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు మద్దెల ఎర్రగట్టు స్వామి, కరుణాకర్‌రెడ్డి, వినోద్‌కుమార్, మండల సురేష్,భిక్షపతి, కృష్ణమూర్తి, కిశోర్, పెద్ది సత్యనారాయణ, సాంబరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల ప్రత్యేక సమావేశం

కాజీపేట : కాజీపేట పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో నేడు మంగళవారం ఉదయం 10:30 గంటలకు హెచ్ఆర్ఎంఎస్ ఈ–పాస్, హెచ్ఎంబిఎస్ బోబైల్ భద్రతపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంగమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్, ఇతర పెన్షనర్ల సంఘాల సహకారంతో డిజిటల్ లిటరసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే పెన్షనర్లు ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరుకవాడకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బత్తుల లక్ష్మీనారాయణ (88) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. అతడికి భార్య లక్ష్మి, కుమారుడు రమేశ్, కుమార్తె రమ ఉన్నారు. ఆయన మృతి విషయం తెలిసి స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రతినిధులతోపాటు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పలువురు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్, నాగరాజు, బాసాని శ్రీనివాస్, భాస్కర్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్ట్ మృతి

కాజీపేట : కాజీపేట పట్టణంలో సోమవారం సీనియర్ జర్నలిస్ట్ దువ్వ రాజేందర్ (45) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మడికొండకు చెందిన రాజేందర్ దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిస్ట్‌గా పని చేస్తున్నారు. భార్య అమెరికాలో ఉన్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రంలోగా అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు చెబుతున్నారు. సీనియర్ జర్నలిస్ట్ రాజేందర్ మృతికి వరంగల్ ప్రెస్ క్లబ్ నాయకులతో పాటు వివిధ యూనియన్ల నాయకులు సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మామునూరు : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మామునూరు నుంచి వరంగల్ వైపునకు బైక్‌పై బయల్దేరిన ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మామునూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని అధికారులు



శివనగర్‌లో ప్రధాన డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని 34, 35 డివిజన్ల పరిధిలో శివనగర్ విస్తరించి ఉంది. ఇక్కడ ప్రధాన డ్రైయినేజీల్లో పూడిక తీత పనులు చేపట్టడం లేదు. దీంతో ఈఏడాది వానాకాలంలో ప్రజలకు ముంపు తప్పేటట్లు లేదు. మైసయ్యనగర్ నుంచి అండర్ బ్రిడ్జి వరకు ఉన్న డ్రైయినేజీలో చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పాలకులు, అధికారుల అలసత్వంతో శివనగర్ సమస్యలకు కేరాఫ్‌గా మారింది.

సమస్యలకు కేరాఫ్ శివనగర్

డ్రైయినేజీల్లో చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో ప్రజారోగ్యానికి శాపంగా మారింది. పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించడంలో నిర్లక్ష్యం వహించడంతో దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు.

దోమల స్వైరవిహారం

చెత్తచెదారం, వ్యర్థాలు డ్రైయినేజీల్లో గుట్టల్లా పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో కూడా మలేరియా, టైఫాయిడ్ బారిన పడి పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైయినేజీలు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నా పేరు బత్తుల సత్యం 34వ డివిజన్ శివనగర్‌లో నివాసిని. ఇంటి పక్కనే డ్రైయినేజీ ఉంది. వర్షం వస్తే భయం అయితాంది. వర్షాకాలంలో డ్రైయినేజీలు పొంగి ఇళ్లల్లోకి వరదనీరు వస్తోంది. ప్రతి ఏడాది ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ముందస్తు వర్షాలు పడుతున్నా నేటికి కాల్వల్లో పూడిక తీయలేదు. ఈ ఏడాది మరింత కష్టాలు వచ్చే పరిస్థితి ఉందని ఆందోళన ఉంది.

పూడికతీత పనులు చేపట్టాలి



మైసయ్య నగర్ నుంచి శివనగర్ మీదుగా అండర్ బ్రిడ్జి వరకు ఉన్న డ్రైయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో మురుగు నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారంతో నిండింది. బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. ఇకనైనా ప్రజారోగ్యం దృష్ట్యా డ్రైయినేజీల్లో ఎప్పటికప్పుడు పూడిక తీసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

– ఓరుగంటి విమల, వాసవీ కాలనీ, శివనగర్

108 సిబ్బంది సేవలు అభినందనీయం

- జిల్లా ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్
- ఘనంగా జాతీయ పైలట్స్ దినోత్సవం



జాతీయ పైలట్స్ వేడుకలో లక్ష్మణ్, సిబ్బంది

హన్మకొండ అర్బన్ : కొన్నేళ్లుగా ఆయా ప్రాజెక్టుల్లో 108 అత్యవసర సర్వీసుల్లో సేవలందిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని 108, 102, 1962, పార్థివ వాహనాల జిల్లా ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. జాతీయ పైలట్స్ (డ్రైవర్స్) దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లోని 108 సర్వీసు కార్యాలయంలో ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ కేక్ కట్ చేసి పైలెట్స్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉద్యోగులు డ్యూటీలో ఉన్నప్పుడు చాలా అప్రమత్తంగా ఉండి క్షతగాత్రులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లకావత్ బాలాజీ నాయక్, దేవేందర్ రావు, అశోక్ రెడ్డి, అనిల్, కోటిలింగం, రాజు యాదవ్, నరేష్, వేణు, చైతన్య సాగర్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్ : ఈనెల 29నుంచి జూన్ 2వ తేదీ వరకు చండగఢ్‌లో జరిగే 43వ జాతీయ జూనియర్ సాఫ్ట్ బాల్ జూనియర్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు. ఇటీవల మెదక్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కర్పిన జిల్లా క్రీడాకారులు బాలుర విభాగంలో వి.పవన్‌కుమార్, ఎం.జగదీష్, బాలికల విభాగంలో ఎ.స్ఫూర్తి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ వినయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ పి.సాంబశివరావు, కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షుడు పి.సాంబమూర్తి పాల్గొన్నారు.

వరద నీరు తరలించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ముంపు బాధితులు

వరంగల్ అర్బన్ : హంటర్ రోడ్డులోని బొంది వాగు నుంచి పోతన నగర్ చర్చి వరకు కచ్చా కాల్వ తీసి, వరద నీరు తరలించాలని ఆయా కాలనీవాసులు బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని మేయర్ చాంబర్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తంచేశారు. పదేళ్ల నుంచి వరద ముంపుతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు పేర్కొన్నారు. రిటైర్నింగ్ వాల్ కోసం నిధులు మంజూరైన నిర్మాణం చేపట్టకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలం సమీపిస్తున్నందున ముంపు నుంచి కాపాడాలని కోరారు. ఈ నిరసనలో సాయినగర్, భద్రకాళి నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీ, ఎన్‌టీఆర్ నగర్ కాలనీలకు చెందిన మందల నర్సింహా రెడ్డి, సిద్ది రాములు, రాంబాబు, విజయ్, మల్లికార్జున్, శ్రీధర్, శంకర్ సింగ్, శ్రీహరి, రాజ్ కుమార్, కృష్ణ, జలేందర్, చందు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

న్యూశాయంపేట : వరంగల్ డీఈఓ నిర్లక్ష్యంతోనే దుగ్గొండి సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో పదోతరగతి చదివిన విద్యార్థి ఫెయిల్ అయ్యిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని సోమవారం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి విద్యార్థికి న్యాయం చేయాలని కోరారు. అలాగే సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రాజీవ్ యువవికాసం రుణాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. టీజీవీపీ, ఏబీఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల నాయకులు కన్నం సునీల్, మేడ రంజిత్, కాడపాక రాజేందర్, బి.నరేష్, శనిగరపు రాజేందర్‌ప్రసాద్, ఒంటేరు చక్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరన్న బోనాలు



బోనాలతో వెళ్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహిళలు

హసన్‌పర్తి : మండల కేంద్రంలో బీరన్న,కామరాతిస్వామి బోనాల వేడుకలు వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బోనమెత్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు నమిండ్ల శ్రీనివాస్, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, కార్పొరేటర్ శివకుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, వీసం సురేందర్‌రెడ్డి, పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వర్ రావు, రజక సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రబెల్లి స్వర్ణ రూ.5,116 విరాళం అందించారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాం..

- ఎంసీపీఐ పొలిట్ బ్యూరో సభ్యుడు వెంకట్‌రెడ్డి

ఖిలా వరంగల్ : మద్దికాయల ఓంకార్, భీంరెడ్డి నరసింహారెడ్డి, పోగుల ఆగయ్య, పాలం గోపాల్‌రెడ్డి వంటి మహనీయుల ఆశయాలను కొనసాగిస్తామని ఎంసీపీఐ పొలిట్ బ్యూరో సభ్యుడు మద్రెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంసీపీఐ ప్రథమ మహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై అమరవీరుల స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంసీపీఐలో వర్గ విభేదాలు ఒక్కసారి భగ్గుమన్నాయి. ఓ వర్గం వరంగల్ శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎంసీపీఐ పేరుతో మహాసభ నిర్వహిస్తుండగా.. మరోవర్గం ఎంసీపీఐ (యూ) నాయకులు అక్కడి చేరుకుని తమదే అసలైన పార్టీ అని.. మహాసభను రద్దు చేసుకోని వెళ్లిపోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అక్కడే నిరసనకు దిగారు. ఈవిషయం తెలిసి మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్‌తోపాటు ఇంతేజార్‌గంజ్ సీఐ శుక్రుతో కలిసి ఏసీపీ నందిరామ్‌నాయక్ ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎంసీపీఐ (యూ) నేతలు నిరసనను విరమించగా ఇరువర్గాల పార్టీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ను చూపించాలని ఏసీపీ స్పష్టం చేశారు.

ఎంసీపీఐ పేరుతో తప్పుదోవ పట్టించొద్దు

కొంతమంది ద్రోహులు ఎలాంటి అర్హతలు లేకపోయినా ఎంసీపీఐ ప్రథమ మహాసభల పేరుతో పార్టీ కార్యకర్తలు, ప్రజలను తప్పుదోవ పట్టించటం సిగ్గుచేటని ఎంసీపీఐ(యూ) పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి అన్నారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. మహాసభలో మాజీ ఎమ్మెల్యే దివంగత మద్దికాయల ఓంకార్ ఫొటోలు వాడకుండా చర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంద రవి, ఉమ్మడి జిల్లా కార్యదర్శులు ఎన్‌రెడ్డి హంసారెడ్డి, గుండె బోయిన చంద్రయ్య, కంచ వెంకన్న, నర్ర ప్రతాప్, కుసుంభ బాబురావు, కన్నం వెంకన్న, వంగల రాగసుధ, గడ్డం నాగార్జున, కనకం సంధ్య, మాస్ సావత్రి, నూకల ఉపేందర్, కక్ర రాజిరెడ్డి, మహమ్మద్ రాజు , సాహెబ్, గుగులోతు అరుణ్ నాయక్, ఇస్మాయిల్, గూడ సురేష్, కుమారస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

విద్యారణ్యపురి : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 4,665మంది విద్యార్థులకు గాను 4,175 మంది విద్యార్థులు(89శాతం) హాజరు కాగా అందులో 490 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో 1,277మందికి గాను 1,108 మంది విద్యార్థులు (87శాతం) హాజరు కాగా 169మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో ఇంటర్‌ప్రథమ సంవత్సరంలో 1,686 మంది విద్యార్థులకు గాను 1,575 మంది హాజరు కాగా 111మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ తెలిపారు. సెకండియర్ పరీక్షలో 569 మందికి గాను 533 మంది హాజరుకాగా 36మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాజీపేట రూరల్: పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, రైల్వే, మున్సిపల్ అధికారులు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్/కాజీపేట : కాజీపేట పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేట బాపూజీనగర్ బూడిదిగడ్డ–రైల్వే ప్రాంతం సమీపంలోని భారీ డ్రైయినేజీ సమస్యను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే చొరవతో సోమవారం రైల్వే అధికారులు, మున్సిపల్ అధికారులు పొక్లెయినర్ సాయంలో డ్రైయినేజీ శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు జామ్ అయిన డ్రైయినేజీ మరమ్మతు పనులను పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. నాలాలో జామ్ అయిన చెత్తచెదారాన్ని యంత్రాలతో శుభ్రం చేయించడం జరుగుతుందని అన్నారు. రైల్వే జీఎం, డీఆర్ఎంలతో మాట్లాడి డ్రైయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఈఎస్ ఆర్.కె.రాజు, మున్సిపల్ ఎంహెచ్ఓ రాజీరెడ్డి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మహ్మద్ అంకూస్, షేక్ అజ్గర్, మైసారపు సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, టి.మధు, పోగుల శ్రీనివాస్, దువ్వ రాజు, దార్ల రాజ్‌కుమార్, మాతంగి స్వామి, శరత్, మున్సిపల్ సిబ్బంది, వర్కర్స్ పాల్గొన్నారు. అలాగే కాజీపేట 63వ డివిజన్ ఈద్గా రోడ్డు, జూబ్లీ మార్కెట్‌లో రూ.1.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. సమావేశంలో కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ అంకూస్, క్రాంతి, పి.ఆంజనేయులు, అజ్గర్, అరూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మడికొండ: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ప్రతీ డివిజన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మడికొండ / కాజీపేట అర్బన్ : వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ పరిధిలో గల వెస్ట్ సిటీలో రూ.20లక్షల నిధులతో, 45వ డివిజన్ పరిధిలోని కడిపికొండలో రూ.28లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారిగా కాలనీలను అభివృద్ధి చేస్తూ ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందజేస్తామని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోరావాలన్నారు. ఇప్పటి వరకు 64వ డివిజన్‌లో రూ.3.5కోట్ల నిధులతో పనులు జరిగాయని వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న డయల్ యువర్ ఎమ్మెల్యే 80961 07107కు కాల్ చేసి మీ సమస్యను పరిష్కరించు కోవాలన్నారు. కార్పొరేటర్ రాధికారెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాసురెడ్డి, 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, రాజుయాదవ్, సదానందం, వెంకటరమణా, రమేష్, రేవంత్, వేణుగోపాల్, సుధాకర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

హన్మకొండ అర్బన్ : ఐనవోలు మండలం పంథిని గ్రామంలో ఖమ్మం హైవే రోడ్డు పక్కనే ఉన్న సర్వే నంబర్ 322లోని ఎస్సీలకు చెందిన 35 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన విక్రమ్‌రావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి విక్రమ్‌రావు దళితుల భూములను నకిలీ పట్టాలతో పాస్ బుక్‌లో ఎక్కించారన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కూడా ఎలాంటి విచారణ చేపడం లేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని భూమిని కాపాడి దళితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితులు ఎస్.అఖిల్, రాజశేఖర్, రాజ్‌కుమార్, ప్రసాద్, యశ్వంత్, పూలమ్మ, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మత్మోన్మాదం దేశానికి ప్రమాదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి: మతోన్మాదం, యుద్ధోన్మాదం దేశానికి ప్రమాదమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ హనుమకొండ ద్వితీయ మహాసభలు హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గుత్తా కోటీశ్వరులకు రైట్ ఆఫ్ లోన్స్ పేరిట రూ.16.35 కోట్లు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో విప్లవకారుల ఎన్‌కౌంటర్ ఆపి శాంతి చర్చలు జరపాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మండల కేంద్రంలో సీపీఐ నాయకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. నేదునూరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి జ్యోతి, రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తీర్చండి.. మహాప్రభో

- గ్రేటర్ గ్రీవెన్‌కు 86 ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్ : కాలనీల్లో కనీస వసతులు లేవు.. వారానికోసారి వినతి ఇచ్చిన ఇంజినీర్లు పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు గ్రీవెన్స్‌లో గోడు వెల్లబోసుకున్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్ సెల్‌లో అదనపు కమిషనర్ జోనా, ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 85 ఫిర్యాదులు రాగా అందులో ఇంజనీరింగ్ సెక్షన్–25, టౌన్ ప్లానింగ్–38, ప్రజారోగ్యం–9, పన్నుల సెక్షన్–7, తాగునీటి సరఫరా–7, డీఆర్ఎఫ్‌కు ఒకటి చొప్పున వినతులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సెక్రటరీ అలివేలు, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఏంహెచ్ఓ రాజేష్, టీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతులు ఇలా ఉన్నాయి..

- వరంగల్ డాక్టర్స్ కాలనీలోని గౌతమి నగర్‌లో సీసీ రోడ్డు ఎత్తుగా నిర్మించడంతో వరద ముంపునకు గురికానుందని కాలనీవెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయచంద్ర రెడ్డి వినతి పత్రం అందజేశారు.



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ జోనా, ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్

- రంగశాయిపేట నవాసాల నడుమ ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా మారాయని చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విన్నవించారు.
- 13వ డివిజన్ ఎస్సీ కులానికి చెందిన శ్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలని జన్ను అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.
- 16వ డివిజన్ జాన్‌పాక హిందూ శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని స్థానికులు వినతిపత్రం సమర్పించారు.
- వరంగల్ వాసవీ కాలనీలో ఐదునెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- 12వ డివిజన్ తుమ్మకుంటలోని వక్కపొడి ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని స్థానికులు ఫిర్యాదు అందజేశారు.
- 39వ డివిజన్ ఏకశిలా నగర్‌లో 40ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నామని, డ్రైయినేజీ సదుపాయం కల్పించాలని నడిపల్లి సంపత్‌రావు విన్నవించారు.
- 42వ డివిజన్ రంగశాయిపేటలో, హనుమకొండ గుండ్ల సింగారం రోడ్డు–2లో సీసీ రోడ్డు, సైడ్ డ్రైయినేజీ నిర్మించాలని కాలనీ వాసులు విన్నవించారు.
- హసన్‌పర్తి మండలంలోని సెయింట్‌మేరీ హైస్కూల్ వద్ద నల్లా పైపులైన్ ఏర్పాటు చేసి కలెక్షన్ ఇవ్వాలని కోరారు.
- హనుమకొండ లష్కర్ బజారులో బిల్డింగ్ పర్మిషన్ ఇవ్వాలని ఫీజులు చెల్లించిన జాప్యం చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.
- హంటర్ రోడ్డు త్రివి స్కూల్ వద్ద పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- హసన్‌పర్తి 66వ డివిజన్‌లో డ్రైయినేజీని అసంపూర్తిగా నిర్మించారని, మురుగునీరు ఆగకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మూర్తి శివ కుమార్ కోరారు.
- 56వ డివిజన్ ఉషోదయ కాలనీలో మెటల్ రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయని సీసీ రోడ్డు డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- కాశిబుగ్గ మార్కెట్ రోడ్డులో జనవాసాల మధ్య ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని స్థానికులు వినతిపత్రాన్ని అందజేశారు.

సదస్సుకు తరలిరావాలి

హసన్‌పర్తి : పద్మశ్రీ గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు ఈనెల 31న స్వాగతం పలకడానికి వరంగల్ రైల్వే స్టేషన్‌కు తరలిరావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ పిలుపునిచ్చారు. ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలో సోమవారం జరగగా సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కార్యవర్గ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు విద్యార్థులు, ఉద్యోగులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఆరెపల్లి పవన్, మంద రాజు, సురేందర్, ప్రసాద్, రాజు, జన్ను లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: తెలంగాణ అవతరణ వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశనం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గిరిపుత్రుల కోసం ఇందిరా సౌరగిరి జల వికాసం

గిరిపుత్రుల ఆర్థికాభివృద్ధికి ఇందిరా సౌరగిరి జల వికాస పథకం తోడ్పడుతుందని కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందిర సౌర గిరి జల వికాసం కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, జిల్లా ఫారెస్ట్ అధికారి అనూజ్ అగర్వాల్ పాల్గొని సమీక్షించారు. గిరిజన సంక్షేమాధికారి సౌజన్య, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వ్యవసాఖ అధికారి అనురాధ, డీపీఓ కల్పన, ఆర్డీఓ, అధికారులు పాల్గొన్నారు.